సాక్షి అనంతపురం

ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



మృత్యువులోనూ వీడని స్నేహం

ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు స్నేహితులు దుర్మరణం పాలైన ఘటన బ్రహ్మసముద్రం మండలంలో జరిగింది.

8లో



టమాట కిలో రూ.51

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.51 పలికింది. కనిష్టం రూ.27, సరాసరి రూ.40 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

33.6°/21.8°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జీఆర్పీ పోలీసులకు ప్రతిష్టాత్మక అవార్డు



డీజీపీ నుంచి అవార్డు అందుకుంటున్న జీఆర్‌పీ ఎస్పీ రాహుల్‌మీనా



అవార్డు అందుకున్న సీఐ నగేష్‌బాబు

గుంతకల్లు: చైన్ స్నాచింగ్ కేసును ఛేదించిన గుంతకల్లు జీఆర్పీ పోలీసులకు ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. శుక్రవారం విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు నుంచి గుంతకల్లు రైల్వే జిల్లా జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా పురస్కారం అందుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు ఏటా ఏ, బీ, సీ, డీ అవార్డులను ప్రదానం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో గుంతకల్లు రైల్వే పోలీసులు మూడో స్థానంలో నిలిచి ఈ అవార్డును అందుకున్నారు. ఇటీవలే గుంతకల్లు జీఆర్‌పీ ఎస్పీ కె.చౌడేశ్వరి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తు చౌడేశ్వరి ఎస్పీగా ఉన్న సమయంలో జరిగింది. దీంతో ప్రస్తుత ఎస్పీ రాహుల్ మీనాతోపాటు ఆమెకు కూడా అవార్డును ప్రదానం చేశారు. కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన గుంతకల్లు జీఆర్‌పీ సీఐ నగేష్‌బాబుకు డీజీపీ ప్రశంసాపత్రం అందజేశారు.

డెంగీ కలకలం



ఈ ఫొటోలో కన్పిస్తున్న బాలుడి పేరు మోక్షిత్. వయసు 9 ఏళ్లు. బాలుడి కుటుంబం అనంతపురంలోని రెండో రోడ్డులో నివాసం ఉంటోంది. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న మోక్షిత్‌ను కుటుంబసభ్యులు సాయినగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఇటీవల చూపించారు. వైద్యులు డెంగీగా నిర్ధారించి, జీజీహెచ్‌కు రెఫర్ చేశారు. ప్రస్తుతం బాలుడు ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో చికిత్స పొందుతున్నాడు.



ఈ ఫొటోలో కన్పిస్తున్న బాలిక పేరు సాజియా అంజుమ్. వయసు నాలుగేళ్లు. అనంతపురం రూరల్ మండలం ఏ నారాయణపురం గ్రామానికి చెందిన ఈ బాలిక కొన్ని రోజులుగా డెంగీతో బాధపడుతోంది. జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. మోక్షిత్, అంజుమ్ ఇద్దరే కాదు.. ఎంతో మంది పిల్లలు డెంగీతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సర్వజనాస్పత్రిలో ఈ ఏడాది జూలైలో 24, ఆగస్టులో 44, సెప్టెంబర్‌లో 56 కేసులు నమోదయ్యాయి.



జ్వర పీడితులతో నిండిపోయిన అనంతపురం సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డు

- జిల్లాలో విజృంభిస్తున్న మహమ్మారి
- మూడు నెలల్లో 200కు పైగా కేసులు
- సర్వజనాస్పత్రిలో నిత్యం పదుల సంఖ్యలో జ్వరపీడితులు
- కట్టడి చేయడంలో ఆరోగ్య శాఖ విఫలం

అనంతపురం మెడికల్: జిల్లాలో డెంగీ బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. చాపకింద నీరులా వ్యాపిస్తున్న డెంగీ మహమ్మారిని నియంత్రించడంలో ఆరోగ్యశాఖ విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన 3 నెలల్లో 200కు పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ఒక్క అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోనే గడిచిన మూడు నెలల్లో 130కిపైగా కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కానీ వైద్య ఆరోగ్యశాఖాధికారులు మాత్రం ఈ ఏడాది జనవరి నుంచి 86 కేసులు మాత్రమే వచ్చాయని చెబుతుండడం గమనార్హం.

ప్రభావిత ప్రాంతాలు ఇవే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అనంతపురం అర్బన్, రూరల్, నార్పల, రాప్తాడు, తలుపుల, బత్తలపల్లి, రాయదుర్గం, నల్లమాడ, గుత్తి, గుంతకల్లు, ముదిగుబ్బ, బుక్కరాయసముద్రం తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. హైరిస్క్ ప్రాంతాలపై ఆరోగ్యశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో దోమకాటు నివారణ చర్యలు చేపట్టడం లేదు. నగరపాలక సంస్థ, మునిసిపాలిటీలు, పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుని ఫాగింగ్, స్ప్రేయింగ్, డ్రై డే కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాల్సి ఉన్నా జిల్లా మలేరియా విభాగం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమైంది. డెంగీ ప్రబలుతున్నా ఆరోగ్యశాఖాధికారులు తప్పుడు లెక్కలు చూపుతూ కాలయాపన చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో దోమకాటు నివారణ చర్యలు చేపట్టాల్సింది పోయి జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో 'స్వచ్ఛ భారత్' అంటూ ఫొటోలకు ఫోజులిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అయినా ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి డెంగీ కట్టడికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కేసులు పెద్దగా నమోదు కాలేదు

జిల్లాలో డెంగీ కేసులు పెద్దగా నమోదు కాలేదు. ఎలీసా రీడర్ ద్వారా నిర్ధారణ చేసిన వాటిని మాత్రమే డెంగీ కేసులుగా పరిగణించాలి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 86 కేసులు మాత్రమే నమోదయ్యాయి. క్షేత్రస్థాయిలో దోమకాటు నివారణ చర్యల్లో భాగంగా వారంలో ఒక రోజు డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

– ఓబులు, జిల్లా మలేరియా అధికారి

వీఆర్‌ఏల సంఘం నూతన కమిటీ ఎన్నిక



వీఆర్‌ఏల సంఘం నూతన కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.ఎన్.దివాకర్‌రావు నేతృత్వంలో ఆదివారం స్థానిక కృష్ణకళామందిర్‌లోని రెవెన్యూ హోమ్‌లో సంఘం సమావేశం నిర్వహించారు. వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏలు, కారుణ్య నియామకం పొందిన వీఆర్‌ఏలతో కలిపి నూతన కమిటీని ఎన్నుకున్నారు.

జిల్లా నూతన కమిటీ...

వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షునిగా వి.ఓబుళేసు, ప్రధాన కార్యదర్శిగా వాల్మీకి నాగరాజును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జి.తలారి నాగరాజు, వై.బాల ఓబుళేసు, బి.సందీప్, వై.ఎర్రిస్వామి, కోశాధికారిగా సి.విజయ, సహాధ్యక్షునిగా టి.సీతారాం, కార్యవర్గ సభ్యులుగా ఎ.రవిచంద్ర, బి.చంద్రమోహన్‌ను ఎన్నుకున్నారు.

సకాలంలో ఈ- క్రాప్ నమోదు

పెద్దవడుగూరు : రైతులు సాగు చేసిన పంటల వివరాలను సకాలంలో ఈ-క్రాప్ నమోదు చేయించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం మండలంలోని చిత్రచేడు, మొలకతాళ్ల, క్రిష్టిపాడు, బుర్నాకుంట, అప్పేచెర్ల గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు సేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది పొలాలకు వెళ్లి పంట నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ ఏఓ శంకర్‌లాల్‌నాయక్, ఏఈఓ సునీత పాల్గొన్నారు.

భారీ వర్షం.. తీరని నష్టం



బొమ్మనహాళ్ మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి హగరి నది



నీట మునిగిన వరి పంట

- ఉద్యాన రైతులకు కోలుకోలేని దెబ్బ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షంతో పలు చోట్ల పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. దీంతో రైతులకు తీరని నష్టం కలిగింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 28 మండలాల పరిధిలో 34.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు ఉద్యాన పంటలకు రూ.84 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఆశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వరి, మొక్కజొన్న, వేరుశనగ, కంది, పత్తి తదితర పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఎక్కువశాతం బొమ్మనహాళ్, రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో మిరప, టమాట పంటలు 54 హెక్టార్లలో దెబ్బ తిన్నట్లు గుర్తించారు. 26 మంది రైతులకు రూ. 84 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు వివరించారు.

బొమ్మనహాళ్‌లో కుండపోత

బొమ్మనహాళ్ మండలంలో 148 మి.మీ కుండపోత వర్షం కురిసింది. గార్లదిన్నె 75.8 మి.మీ, రాయదుర్గం 75.6, పామిడి 62.32, డి.హీరేహాళ్ 59.8, బెళుగుప్ప 56.2, గుత్తి 55.2, విడపనకల్లు 54.6, కణేకల్లు 54, కళ్యాణదుర్గం 50 మి.మీ భారీ వర్షం పడింది. అలాగే శింగనమల 48.6, పెద్దవడుగూరు 40.6, గుమ్మఘట్ట 36.2, ఉరవకొండ 34.2, శెట్టూరు 30.4, కంబదూరు 28.4, వజ్రకరూరు 27.4, గుంతకల్లు 27.2, బ్రహ్మసముద్రం 22 మి.మీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో కూడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిశాయి. అక్టోబర్ నెల సాధారణ వర్షపాతం 100.9 మి.మీ కాగా ప్రస్తుతానికి 45.6 మి.మీ నమోదైంది. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ వర్షాలు రబీ సాగుకు అనువు కావడంతో ప్రధానపంట పప్పుశనగ సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. కానీ వ్యవసాయశాఖ ఇంకా రాయితీ విత్తన విత్తనం పంపిణీ మొదలు పెట్టలేదు. రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, త్వరలోనే పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

వాగులో చిక్కుకున్న కూలీలు



జేసీబీతో కూలీలను రక్షిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: ఆరుగురు కూలీలు వాగులో చిక్కుకుపోయిన ఘటన పెద్దవడుగూరు మండలంలో జరిగింది. శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి మండలంలోని పి.వీరన్నపల్లి సమీపంలో పుల్లేటి వాగు, పందుల వాగులు పోటెత్తాయి. ఈ క్రమంలో చిత్రచేడు గ్రామానికి రాము తన ట్రాక్టర్‌కు పంట నూర్పిడి యంత్రం తగిలించుకుని ఆరుగురు కూలీలతో వెళ్తుండగా, పుల్లేటి వాగులో ట్రాక్టర్ ఇరుక్కొంది. అనుకోని విపత్తు ఎదురుకావడంతో కూలీలు హాహాకారాలు చేశారు. గ్రామస్తుల సమాచారంతో తహసీల్దార్ ఉషారాణి, ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కూలీలకు ఎలాంటి ప్రాణహాని కలగకుండా జేసీబీ సాయంతో రక్షించారు. పంట నూర్పిడి యంత్రాన్ని కూడా బయటకు తీశారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



వాగులో ఇరుక్కుపోయిన పంట నూర్పిడి యంత్రం

యథేచ్ఛగా మట్టి దోపిడీ



కొత్తకోట కొండ వద్ద ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మట్టి తరలించిన దృశ్యం

విడపనకల్లు: స్థానిక మోడల్ స్కూలు వెనుక భాగంలో ఉన్న కొత్తకోట కొండ నుంచి టీడీపీ నేతలకు చెందిన ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మట్టిని కొల్లగొడుతోంది. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు వందల ట్రిప్పుల మట్టిని కర్ణాటకలోని బళ్లారి వద్ద ఉన్న హగరి హైవే రోడ్డు మరమ్మతులకు తరలిస్తున్నారు. 42వ జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు గుండానే దందా సాగిస్తున్నా ఇక్కడి సిబ్బంది తమకేమీ పట్టదన్నట్లుగా మౌనంగా ఉంటున్నారు. ఈ క్రమంలో 'ప్రభుత్వం మాది .. మమ్మల్ని అడిగే వారెవరు' అన్న రీతిలో టీడీపీ నేతలు వ్యవహారం సాగిస్తున్నారు. దాదాపు 20 రోజులుగా మట్టి దోపిడీ సాగుతున్నా రెవెన్యూ అధికారులు కానీ, పోలీసులు కానీ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. టీడీపీ నాయకులకు అధికారులు తలొగ్గిపోయారని స్థానికులు వాపోతున్నారు. దీనిపై తహసీల్దారు సునీత బాయి వివరణ కోరగా.. మట్టి తరలింపునకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు. వి.కొత్తకోట గ్రామానికి చెందిన రమేష్ పట్టా భూమిలో మట్టి తరలిస్తున్నారని తెలిపారు. దీనిపై ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ మాట్లాడుతూ మట్టి తరలింపుపై తమకు ఎలాంటి సమాచారమూ లేదన్నారు. రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



మట్టిని తరలించడానికి ప్రత్యేకంగా రహదారిని ఏర్పాటు చేసుకున్న దృశ్యం

కాటమరాయా.. కరుణించవయా

ఖాద్రీశుని దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు

కదిరి టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాలు.. దసరా సెలవులు..స్వామి జన్మనక్షత్రమైన స్వాతి శనివారం కలగలిపి రావడంతో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కాటమరాయా...కరుణించవయా అంటూ వేడుకున్నారు. భక్తజనంతో ఆలయం ప్రాంగణం కిటకిటలాడింది.

నృసింహుడి అలంకరణలో ఖాద్రీశుడు..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు శనివారం రాత్రి నృసింహ అవతార అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.



నృసింహావతారంలో ఖాద్రీశుడు



ఖాద్రీశుని దర్శనం కోసం క్యూలో వేచి వున్న భక్తులు

అడ్డొస్తే అవస్థలే



- మద్యం షాపులన్నీ దక్కించుకునేందుకు 'తమ్ముళ్ల' ప్రయత్నాలు
- దరఖాస్తులు వేయొద్దంటూ ఔత్సాహికులకు బెదిరింపులు
- ఒకవేళ షాపు తెచ్చుకున్నా.. నడిపించలేరంటూ హెచ్చరికలు
- అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లులో తీవ్రమైన బెదిరింపుల పర్వం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: మద్యం షాపులను దక్కించుకునేందుకు టీడీపీ నేతలు అన్నిరకాల కుయుక్తులు పన్నుతున్నారు. ఎలాగైనా సరే తమ పార్టీ వారికే మద్యం షాపులు దక్కాలనే ఉద్దేశంతో సిండికేట్‌కు ప్రయత్నిస్తున్నారు. పేరుకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ, లాటరీ ద్వారా ఎంపిక అంటున్నా.. లోలోపల మాత్రం చెయ్యాల్సిన దుర్మార్గపు పనులన్నీ చేసేస్తున్నారు. మద్యం షాపుల ద్వారా వ్యాపారం చేయాలని భావిస్తున్న వారిని పోటీకి రాకుండా బెదిరిస్తున్నారు. 'మాకు తెలీకుండా మీరు దరఖాస్తు చేసినా..తర్వాత వ్యాపారం ఎలా చేసుకుంటారో చూస్తాం' అంటూ హెచ్చరిస్తున్నారు. వారం రోజుల క్రితం బార్ల యజమానులను సైతం పిలిచి అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సమావేశం పెట్టి మరీ హుకుం జారీ చేశారు. ఈ క్రమంలో గతంలో మద్యం వ్యాపారం చేసిన వారు సైతం ఇప్పుడు దరఖాస్తులు వేయడానికే భయపడుతున్నారు.

దరఖాస్తుదారులపై నిఘా..

మద్యం షాపులు దక్కించుకునేందుకు ఎవరైనా రూ.2 లక్షల రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, ఎవరెవరు దరఖాస్తు చేస్తున్నారన్న సమాచారాన్ని పోలీసు వర్గాల ద్వారా టీడీపీ నేతలు సేకరిస్తున్నారు. దరఖాస్తు చేయకముందే వారిని సామ,దాన, భేద దండోపాయాలతో దారికి తెచ్చుకుంటున్నారు.

లాటరీలో వస్తే మాకే ఇవ్వండి..

ఒకవేళ తమ మాట కాదని దరఖాస్తు చేసి లాటరీలో కనుక షాపు దక్కించుకుంటే తిరిగి తమకే ఇవ్వాలని కూడా టీడీపీ నేతలు ముందే సూచిస్తున్నారు. లేదంటే వ్యాపారం ఎలా చేస్తారో చూస్తామని సదరు దరఖాస్తుదారులను బెదిరిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంలో కనీసం ఐదారు షాపులను సంబంధిత ఎమ్మెల్యేకు వదిలేయాలని హుకుం జారీ చేస్తున్నారు. ఎమ్మెల్యేలు స్వయంగా సీఐలతో ఫోన్లు చేయిస్తున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలో సిండికేట్ వ్యవహారంలో స్థానిక వన్‌టౌన్ సీఐతో పాటు ఓ నేత కీలకంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. ముఖ్యంగా తాడిపత్రి, గుంతకల్లు, అనంతపురం వంటి నియోజకవర్గాల్లో బెదిరింపుల కారణంగా దరఖాస్తు వేయడానికి సైతం పలువురు భయపడుతున్నారు. దరఖాస్తులకు నాలుగు రోజులే గడువు ఉండటంతో ఏం చేయాలో దిక్కుతెలియని స్థితిలో ఉన్నారు. దరఖాస్తులకు ఈ నెల 9 చివరి తేదీ కాగా.. 11వ తేదీన కలెక్టరేట్‌లో లాటరీ తీయనున్నారు. దీంతో మద్యం షాపుల లాటరీ ఎటు నుంచి ఎటు వెళుతుందోననే భయాందోళన వ్యక్తమవుతోంది.

ఈ-ఆఫీస్ అంతంతే

- ఆచరణలో అలసత్వ ధోరణి
- 127 శాఖల్లో 1.95 లక్షల ఫైళ్లు పెండింగ్
- 60 రోజుల గడువు మీరిన ఫైళ్లే 1.87 లక్షలు


విధుల్లో ఉన్న ఉద్యోగులు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత.. జవాబుదారీతనం.. కచ్చితత్వం... సమయపాలన కోసం ఈ-ఆఫీసు విధానం ప్రవేశ పెట్టారు. ఏళ్లు గడుస్తున్నా ఆచరణలో అలసత్వ ధోరణి స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. జూనియర్ అసిస్టెంట్ నుంచి శాఖాధిపతి వరకు తప్పనిసరిగా ప్రతి ఫైలు డిజిటల్ సంతకంతో ఈ-ఆఫీసులోనే పంపించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పదేపదే చెబుతున్నా కొందరు ఉద్యోగులు 'మాదారి మాదే' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ-ఆఫీసు పెండింగ్ ఫైళ్ల సంఖ్య, ఈ-ఆఫీసు మ్యాపింగ్ అయినప్పటికీ డిజిటల్ సంతకం లేని ఉద్యోగుల సంఖ్యే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. జిల్లాలో 127 శాఖల్లో ఈ-ఆఫీసు అమలవుతోంది. ఈ-ఆఫీసులో 6,307 మంది ఉద్యోగులు మ్యాపింగ్ అయ్యారు. వీరిలో డిజిటల్ సంతకం లేని వారు 3,600 మంది ఉన్నారు.

1.95 లక్షల ఫైళ్లు పెండింగ్..

ఈ-ఆఫీసు విధానం అమలైనప్పటి నుంచి ఇప్పటి వరకు 127 శాఖల పరిధిలో 3,11,995 ఫైళ్లు తయారయ్యాయి. అదే విధంగా 21,27,554 ఫైళ్లు స్వీకరించాయి. వీటి పరిష్కారం విషయానికి వస్తే 1,95,536 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో అత్యధికంగా కాలపరిమితి 60 రోజుల దాటినవి 1,87,256 ఉండడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే ఈ-ఆఫీసు ద్వారా ఫైళ్ల పరిష్కారం వంద శాతం జరగడం లేదనే విషయం స్పష్టమవుతోంది.

ఈ-ఆఫీస్ లోగో

డిజిటల్ సంతకమే జవాబుదారీతనం..

ఈ-ఆఫీసులో ఫైళ్లను పంపించే ఉద్యోగి తప్పనిసరిగా డిజిటల్ సంతకం చేసి పంపిస్తేనే జవాబుదారీతనం ఉంటుంది. కాబట్టి ఈ-ఆఫీసులో మ్యాపింగ్ అయిన ఉద్యోగులు డిజిటల్ కీ తీసుకోవాల్సి ఉంటుంది. కలెక్టరేట్‌లోని నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్‌లో (ఎన్‌ఐసీ) ఈ ప్రక్రియను టెక్నికల్ అధికారులు అనిల్ యాదవ్, అభిలాష్‌రెడ్డి నిర్వహిస్తారు.

సెప్టెంబర్ 30 వరకు ఈ-ఆఫీస్ ఫైళ్ల పెండింగ్ వివరాలు

పెండింగ్‌లో ఉన్న మొత్తం ఫైళ్లు	1,95,536
0-7 రోజుల మధ్య ఉన్నవి	1,404
8-15 రోజుల మధ్య ఉన్నవి	1,285
16-30 రోజుల మధ్య ఉన్నవి	3,272
31-60 రోజుల మధ్య ఉన్నవి	2,320
60 రోజులు దాటినవి	1,87,256

ఈ-ఆఫీసులో ఫైళ్లను పంపించే ప్రతి ఉద్యోగి డిజిటల్ సంతకం తప్పనిసరిగా ఉపయోగించాల్సి ఉంటుంది. 127 శాఖలకు సంబంధించి 6,307 మంది ఉద్యోగులు ఈ-ఆఫీసులో మ్యాపింగ్ అయినప్పటికీ 3,600 మంది డిజిటల్ సంతకం లేకుండా ఉన్నట్లు సమాచారం.

శాఖల వారీగా పెండింగ్ వివరాలు

శాఖ	ఫైళ్ల సంఖ్య
రెవెన్యూ	42,487
నగర పాలక సంస్థ	17,338
పోలీసు (హెచ్ఓఎం-02)	14,206
పశుసంవర్ధక	8,939
జల వనరులు	7,378
జిల్లా పరిషత్	5,632
గ్రామీణాభివృద్ధి	5,473
ఖజానా	4,042
వాణిజ్య పన్నులు	3,421
ప్రజారోగ్య	3,153
జిల్లా పంచాయతీ	3,068

సంతకం తప్పనిసరిగా ఉండాలి



ఈ-ఆఫీసులో ఫైళ్లను పంపించే ఉద్యోగి తప్పనిసరిగా డిజిటల్ సంతకం చేయాలని ఆదేశాలిచ్చాం. డిజిటల్ సంతకంతో పంపినప్పుడే జవాబుదారీతనం ఉంటుంది. ఒకవేళ డిజిటల్ సంతకం లేని వారు ఆధార్ డిజిటల్ సంతకం ద్వారా ఫైళ్లు పంపించాలి. అంతే తప్ప సంతకం లేకుండా ఈ-ఆఫీసులో ఫైళ్లు పంపకూడదని స్పష్టంగా చెప్పాం. డిజిటల్ సంతకం లేని వారు ఎన్‌ఐసీకి వెళ్లి తీసుకోవాలి.

-వి.వినోద్‌కుమార్, కలెక్టర్

క్లుప్తంగా

బూదగవిలో చోరీ


బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడిన దృశ్యం

ఉరవకొండ: బూదగవిలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు నగలు, నగదు ఎత్తుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ధనుంజయ అనే వ్యక్తి కాయగూరల మండీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొడుకు చదువు కోసం ఇంట్లో ఉన్న గొర్రెలను అమ్మి నగదును బీరువాలో ఉంచాడు. అందులోనే భార్య బంగారు నగలు భద్రపరిచారు. దసరా సెలవులు రావడంతో పిల్లలను తీసుకుని భార్య తన పుట్టింటికి వెళ్లింది. ధనుంజయ శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి మండీలో పనికి వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి రాగానే ఇంటి తాళం ధ్వంసమై ఉండటం గమనించి లోనికెళ్లి పరిశీలించాడు. బీరువాలోని 7 తులాల బంగారు నగలతో పాటు రూ.1.50 లక్షల నగదు కనిపించలేదు. చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం క్లూస్ టీం రంగంలో దిగి వేలిముద్రలు సేకరించింది. సీఐ సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. వృద్ధుడి దుర్మరణం


మృతి చెందిన ఎర్రిస్వామి

రాయదుర్గంటౌన్: నల్లంపల్లి సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో కణేకల్లు మండలం ఆదిగానిపల్లికి చెందిన ఎర్రిస్వామి (60) మృతి చెందాడు. ఆటోలో ఉన్న మరో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అనారోగ్యంతో ఉన్న తన భార్యకు మాత్రలు తెచ్చేందుకు ఎర్రిస్వామి కణేకల్లు క్రాస్ నుంచి రాయదుర్గానికి ప్యాసింజర్ ఆటోలో బయల్దేరాడు. అతనితోపాటు మరో నలుగురు ఆటోలో ఉన్నారు. నల్లంపల్లి సమీపంలో చేరుకోగానే డ్రైవర్ అదుపుతప్పడంతో ఆటో బోల్తా పడింది. ఆటో కింద ఇరుక్కున్న ఎర్రిస్వామి తల, ఛాతీ భాగం తీవ్రంగా దెబ్బతిన్నాయి. డ్రైవర్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎర్రిస్వామిని రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి.. మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఎర్రిస్వామికి భార్య తిప్పమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

లిఫ్ట్ పనులు చేస్తూ కార్మికుడి మృతి


మృతి చెందిన షెక్షావలి

తాడిపత్రి రూరల్: లిఫ్ట్ పనులు చేస్తుండగా ఓ కార్మికుడు ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందాడు. కొట్టాలపల్లికి చెందిన షెక్షావలి (36) శనివారం తాడిపత్రి సమీపంలోని పోతులయ్యపాలెంలో ఓ ఇంటికి లిఫ్ట్ పనులు చేసేందుకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తూ జారి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే షెక్షావలి మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. చనిపోయిన కార్మికుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ శివ గంగాధర్‌రెడ్డి తెలిపారు.

ఐఆర్, పీఆర్సీ అమలు చేయాలి


సమావేశంలో పాల్గొన్న ఏపీ ఎస్‌ఏ అసోసియేషన్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: దసరా కానుకగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్, 12వ పీఆర్సీ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్ఎస్ఏ) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఉపాధ్యాయ భవనంలో అసోసియేషన్ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శివశంకర్, లింగమూర్తి మాట్లాడుతూ 117 జీఓను వెంటనే రద్దు చేయాలన్నారు. 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేయాలన్నారు. ప్రతి స్కూల్‌లోనూ తెలుగు మీడియంతో పాటు ఇంగ్లిష్ మీడియం కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఈఎల్స్, డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి బొల్లే రాజశేఖర్ మాట్లాడుతూ బోధనేతర యాప్‌లకు ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకరయ్య,నాయకులు నాగన్న, జిల్లా గౌరవాధ్యక్షులు నారాయణస్వామి, శ్రీరాములు, చలపతి పాల్గొన్నారు.

పట్టపగలే రూ.3 లక్షల చోరీ


బ్యాంకులో సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలిస్తున్న సీఐ

నార్పల: మండల కేంద్రం నార్పలలో పట్టపగలే రూ.3 లక్షల నగదు చోరీ అయ్యింది. వివరాలిలా ఉన్నాయి. వెంకటాంపల్లికి చెందిన శ్రీనివాసులు శనివారం తన భార్యతో కలసి నార్పలలో స్టేట్ బ్యాంక్‌కు వెళ్లి రూ.మూడు లక్షలు విత్‌డ్రా చేశాడు. ఆ నగదును ద్విచక్ర వాహనంలో భద్రపరచి సంతకు వెళ్లాడు. అక్కడ కూరగాయలు కొనుగోలు చేస్తుండగా.. బైక్‌లోని నగదును ఎవరో అపహరించుకుపోయారు. తర్వాత శ్రీనివాసులు బైక్‌ను పరిశీలించగా నగదు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారమందించారు. సీఐ కౌలుట్లయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పలువురిని విచారణ చేశారు. బ్యాంకుకు వెళ్లి సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని చెప్పారు.

మృత్యువులోనూ వీడని స్నేహం


మృతులు లక్ష్మీకాంత్, వన్నూరుస్వామి (ఫైల్)


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు

- ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు స్నేహితుల దుర్మరణం

బ్రహ్మసముద్రం: ఆ ఇద్దరు యువకులు స్నేహితులు. గొర్రెల కాపరులైన వీరు రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసుండేవారు. అలాంటి వీరిద్దరిపై విధి చిన్నచూపు చూసింది. ట్రాక్టర్ బోల్తాపడిన ప్రమాదంలో ఇద్దరూ దుర్మరణం చెందారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బ్రహ్మసముద్రం మండలం ముప్పులకుంట గ్రామానికి చెందిన గొల్ల బొజ్జప్ప, తమ్మక్క దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు భోగేష్‌కు వివాహం కాగా.. కుమార్తె నేత్రావతి చదువుతోంది. చిన్న కుమారుడు గొల్ల లక్ష్మీకాంత్ (18) గొర్రెలకాపరిగా ఇంటికి చేదోడువాదోడుగా ఉండేవాడు. ఇదే గ్రామానికి చెందిన బోయ గోవిందప్ప, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం కాగా కుమారుడు బోయ వన్నూరుస్వామి (21) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. గొర్రెలను మేతకు తీసుకెళ్లే సమయంలో లక్ష్మీకాంత్, వన్నూరుస్వామిల మధ్య స్నేహం ఏర్పడింది.

పొలం పనులకు వెళ్లి తిరిగొస్తుండగా....

శుక్రవారం సాయంత్రం సమీప బంధువు ట్రాక్టర్‌ను వేసుకుని లక్ష్మీకాంత్ చిన్నాన్న కుమారుడు ధనుష్‌ను వెంటబెట్టుకుని స్నేహితుడైన బోయ వన్నూరుస్వామితో కలిసి ట్రాక్టర్‌లో పొలం పనులకు వెళ్లాడు. రాత్రి 8 గంటల సమయంలో పొలం పనులు చేస్తుండగా భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో పొలంలోనే చెట్ల కింద సేద తీరారు. అయితే వర్షం తగ్గేలా కనిపించకపోవడంతో ఇంటికి పయనమయ్యారు. పొలం నుంచి కొద్ది దూరం వచ్చాక భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండటంతో ఒక్కసారిగా ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న పొలంలో బోల్తా పడింది. ఇంజిన్ వద్ద ఉన్న ధనుష్ ఎగిరి దూరంగా పడిపోయాడు. లక్ష్మీకాంత్, వన్నూరుస్వామి ట్రాక్టర్ ఇంజిన్ కింద పడిపోయారు. భయభ్రాంతులకు గురైన ధనుష్ గట్టిగా అరుస్తూ భారీ వర్షంలోనే గ్రామంలోకి పరుగెత్తుకువచ్చాడు. జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిపాడు. ఇరు కుటుంబ సభ్యులు, బంధువులు రాత్రి ఒంటి గంట సమయానికి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ట్రాక్టర్ కింద పడిన కుమారులను చూసి వారి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. శనివారం తెల్లవారుజామున బ్రహ్మసముద్రం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి, లక్ష్మీకాంత్, వన్నూరుస్వామి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. స్నేహితులిద్దరూ ఒకేసారి మరణించడంతో ముప్పులకుంటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడదాం

- జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: పాలకవర్గం - అధికారులు సమన్వయం, పరస్పర సహకారంతో పని చేసి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడదామని ఉభయ జిల్లాల జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఉమ్మడి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా బదిలీపై వచ్చిన జి.వెంకటసుబ్బయ్య శనివారం ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకవర్గంతో పాటు ఉద్యోగులతో సఖ్యతగా ఉంటూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని ఛైర్‌పర్సన్ సూచించారు. అనంతరం ఆయన బాధ్యతలు చేపట్టారు.

డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య నేపథ్యం

ఉమ్మడి కడప జిల్లా లక్కిరెడ్డిపల్లెకు చెందిన జి.వెంకటసుబ్బయ్య గ్రూప్-2 ద్వారా 1996లో ఈఓపీఆర్‌డీగా ఎంపికయ్యారు. అదే జిల్లా వేముల, రామాపురంలో ఈఓపీఆర్‌డీగా పని చేశారు. ఆ తరువాత పదోన్నతిపై చక్రాయపేట, పెండ్లిమర్రి, రామాపురం, రాజంపేట, ఓబులవారిపల్లి, వీరబల్లిలో ఎంపీడీఓగా సేవలందించారు. 23 ఏళ్ల తరువాత డీఎల్‌డీఓగా పదోన్నతిపై కడప డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఇప్పుడు సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా నియమితులయ్యారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు

బుక్కరాయసముద్రం: చిరుధాన్యాల సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు తెలిపారు. శనివారం రేకులకుంటలోని పరిశోధన స్థానంలో రేకులకుంట, రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు కంది, జొన్న, కొర్ర, (సూర్యనంది, మహానంది) సజ్జ, అలసంద, ఉలవ, ఆముదం, పెసర, (ఐసీఈఎం-314) అనుములు, వర్షాధార నల్లరేగడి నేలల్లో వేసుకోవాల్సిన ప్రత్యామ్నాయ పంటలు, ఎరువుల యాజమాన్యం, చీడ పీడల నివారణ మార్గాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ రమేష్ నాయక్, డాక్టర్ లక్ష్మన్, రెడ్డిపల్లి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

9లోపు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం: మద్యం షాపు లైసెన్సులకు ఈ నెల తొమ్మిదో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సూచించారు. దరఖాస్తులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, అనంతపురానికి వచ్చి నివృత్తి చేసుకోవాలన్నారు. సర్వర్ బిజీ అయితే దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ నేపథ్యంలో ముందస్తుగా దరఖాస్తు చేసకుంటే మంచిదని సూచించారు.

ఫిట్టర్ల నియామకానికి చర్యలు

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు బిగించడానికి ఫిట్టర్ల కొరత ఉండటంతో నియామకాలకు చర్యలు చేపట్టినట్లు ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన యువత ఈ నెల 15లోగా ఏపీఎంఐపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి ఫిట్టర్లుగా ఉపాధి అవకాశం కల్పిస్తామని తెలిపారు.

కార్యాచరణ ప్రణాళిక ..

ఈ ఏడాది జిల్లాకు అత్యధికంగా 37,500 హెక్టార్లకు సూక్ష్మసాగు (డ్రిప్, స్ప్రింక్లర్) పరికరాలు రాయితీపై రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్దేశించినందున లక్ష్యం సాధించడానికి కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు పీడీ రఘునాథరెడ్డి వెల్లడించారు. రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోకుంటే వెంటనే రైతు సేవ కేంద్రాల (ఆర్ఎస్‌కే) ప్రతినిధులను సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గార్లదిన్నె: తిమ్మంపేట సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పామిడి మండలం కండ్లపల్లికి చెందిన రాముడు, సుధాకర్ ఇద్దరూ శనివారం ద్విచక్రవాహనంపై గార్లదిన్నె మండలం మర్తాడులో శుభాకార్యానికి హాజరయ్యారు. అక్కడ వేడుకలు ముగించుకుని తిరిగి వస్తుండగా తిమ్మంపేట వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన సేఫ్టీ రేకును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రాముడు (35)ను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలోనే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు.

మట్కా నిర్వాహకురాలి అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో మట్కా నిర్వాహిస్తున్న మహిళను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. రాచప్ప బావి వీధికి చెందిన రేణుకమ్మ మట్కా నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో పట్టణ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి రూ.47,300 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

విజేతలకు ఘన సన్మానం


వెంకటరమణను, మోహన కృష్ణను సన్మానిస్తున్న డీఎస్‌డీఓ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్

అనంతపురం: విశాఖలో గత నెల 29న నిర్వహించిన పారా షూటింగ్, పారా స్విమ్మింగ్ పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన వెంకటరమణ ఎస్‌హెచ్2 విభాగం రైఫిల్ స్టాండింగ్‌లో గోల్డ్‌మెడల్, స్విమ్మింగ్‌లో మోహనకృష్ణ ఎస్‌హెచ్10 విభాగం ఫ్రీ స్టైల్లో గోల్డ్ మెడల్, బ్యాక్ స్ట్రోక్‌లో బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరిని డీఎస్‌డీఓ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర

- ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో వక్తలు


ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న అశోక్

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని ఎస్ఎఫ్ఐ అఖిలభారత మాజీ అధ్యక్షుడు వై.వెంకటేశ్వర, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మండిపడ్డారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి నాలుగురోజుల పాటు జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి వర్క్ షాప్ శనివారం అనంతపురంలో ప్రారంభమైంది. అంబేడ్కర్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న అశోక్ జెండా ఆవిష్కరించి తొలిరోజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వై. వెంకటేశ్వర, డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ విద్యారంగాన్ని నాశనం చేయడానికి నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చిందన్నారు. ఇప్పటికే చాలా స్కూళ్లు మూతపడ్డాయన్నారు. అనేకమంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో వచ్చి 100 రోజులు పూర్తయినా విద్యారంగం పై ఎలాంటి పురోగతీ లేదన్నారు. ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు. నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచి పాలన సాగిస్తున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న అశోక్, ఉపాధ్యక్షుడు ఓతూరు పరమేష్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుతున్న సంక్షేమ హాస్టళ్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నా కనీస చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఏడు నెలలుగా పెండింగ్ ఉన్న మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రామ్మోహన్, వినోద్ కుమార్, కిరణ్, అబ్దుల్లా, రవి, వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు రజిత, అమూల్య అనంతపురం జిల్లా అధ్యక్షుడు సిద్ధు, ఉపాధ్యక్షుడు వైటీసీ రమేష్, శివ, వంశి, సూర్య, భీమేష్, శివ పాల్గొన్నారు.

ఐషర్ డ్రైవర్ దుర్మరణం


రజిని (ఫైల్)

రాప్తాడు: రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఐషర్ డ్రైవర్ రజిని (40) దుర్మరణం చెందాడు. రాప్తాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం విలుపురం జిల్లా మరకణం తాలుకా ఎందూరు గ్రామానికి చెందిన రజిని ఐచర్ వాహనం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తమిళనాడులో బాడుగలు తక్కువగా ఉండడంతో కొన్నేళ్ల క్రితం అనంతపురం వలస వచ్చాడు. రెండు నెలలపాటు బాడుగలు తోలుకుని తర్వాత గ్రామానికి వెళ్లేవాడు. అలా రాప్తాడులో ఐషర్ వాహనాన్ని పెట్రోల్ బంకు సమీపంలో పెట్టుకుని అందులోనే పడుకునే వాడు. ఉదయం వాహనాన్ని తీసుకుని రాప్తాడు మండలంలో 40 మంది కూలీలను తీసుకుని ద్రాక్ష తోటల్లో పనికి తీసుకెళ్లి సాయంత్రం తిరిగి తీసుకొచ్చేవాడు. శుక్రవారం వాహనాన్ని పెట్రోల్ బంకు సమీపంలో ఆపి నిద్రించాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మెలకువ రావడంతో 44వ జాతీయ రహదారి దాటి రోడ్డు అవతలి వైపున టీ తాగి.. తిరిగి వచ్చే క్రమంలో బెంగళూరు నుంచి అతివేగంతో వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో రజిని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రాప్తాడు సీఐ టి.వి.శ్రీహర్ష సమాచారం అందుకుని.. కారును వెంబడించి స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతునికి భార్య చిత్ర, ఇద్దరు కుమారైలు, ఒక కుమారుడు ఉన్నారు.

క్లుప్తంగా

వస్త్ర బ్యాగుల షాపులు ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న కమిషనర్ నాగరాజు

అనంతపురం కార్పొరేషన్: ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా వస్త్ర బ్యాగులను ప్రజలు ఉపయోగించేలా చూస్తాం. స్వయం సహాయక సంఘాల సభ్యురాళ్లకు వస్త్ర షాపులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ నాగరాజు పేర్కొన్నారు. శనివారం నగరంలోని మునిసిపల్ జిమ్ ఆవరణలో మహిళా సంఘాల సభ్యురాళ్లతో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంతో దీర్ఘకాలిక సమస్యలు ఎదురవుతాయన్నారు. నిషేధిక ప్లాస్టిక్‌ను ఎవరూ వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆ దిశగా మహిళల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. మెప్మా సబ్జెక్ట్ విజన్-2047 క్యూఆర్ కోడ్ తదితర విషయాలపై సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి



మాట్లాడుతున్న ఏపీడీ అనురాధ

ఆత్మకూరు: మండలంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ అడిగిన వెంటనే ఉపాధి హామీ పనులు కల్పించాలని ఏపీడీ అనురాధ ఆదేశించారు. శనివారం మండలంలోని పి.యాలేరు వద్ద హార్టికల్చర్ కింద నాటిన మొక్కలను పరిశీలించారు. గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు కల్పించాలన్నారు. అనంతరం మండలంలో నాటిన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తవ్విన ఫారంపాండ్స్ వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆత్మకూరులోని ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి, గృహనిర్మాణ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో పెండింగ్ ఉన్న ఇళ్ల నిర్మాణాల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత , ఉపాధి హామి సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్

అనంతపురం రూరల్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని షికారులు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శకంర్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం బుడ్డప్పనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో షికారీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షికారీలు తమ పిల్లలను బడులకు పంపకుండా వివిధ పనులకు పంపుతున్నారన్నారు. ఇది సరైన నిర్ణయం కాదన్నారు. సమాజంలో గౌరవంగా జీవించాలంటే పిల్లలకు విద్య చాలా ముఖ్యమన్నారు. షికారులకు సొంత ఇళ్లు, రేషన్, ఓటర్, ఆధార్‌కార్డులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారి గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన భాధ్యత అధికారులపై ఉందన్నారు. షికారీల అభివృద్ధికి చర్యలు తీసుకున్న ఆర్డీటీకి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు, తహసీల్దార్ హరికుమార్ పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

అనంతపురం కల్చరల్: తిరుమలను తలపిస్తూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు వేడుకగా కొనసాగుతున్నాయి. భక్తుల గోవింద నామస్మరణతో నగరంలోని శ్రీనివాసనగర్, హౌసింగ్‌బోర్డ్‌లోని వేంకటేశ్వరా ఆలయాలు మార్మోగుతున్నాయి. శనివారం ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నవగ్రహ హోమం, దీక్షా హోమం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా సాగాయి. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడై వేంకటేశ్వరుడు సింహ వాహనంపై విహరించి పూజలందుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన అర్చక బృందం, పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

యంత్రాలపై శిక్షణ

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో మూడు రోజులు నుంచి దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు యంత్ర పరికరాలపై శిక్షణ ఇచ్చినట్లు డైరెక్టర్ బాలాజీ మురారి నాందేడే తెలిపారు. శిక్షణ అనంతరం మహిళలకు సర్టిఫికెట్‌తో పాటు రూ.525 భృతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అగ్రికల్చర్ ఇంజనీర్ విజయ్‌కుమార్, అగ్రికల్చర్ ఇంజనీర్ నితీష్ వర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పండుగ వేళ.. జర భద్రం



ఇస్మాయిల్, సీసీఎస్ సీఐ

అనంతపురం: దసరా పండుగ వేళ ఇళ్లలో దొంగతనాల నివారణకు పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ఇందుకోసం నగరంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలి. పెద్ద పెద్ద కంపెనీలు మంచి ఆఫర్లు ఇచ్చినందున ఇదే అదనుగా భావించి సైబర్ నేరగాళ్లు డూప్లికేట్ ఐడీ క్రియెట్ చేసి ప్రజలను మోసం చేసే అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారు మోసపోయి విలువైన డబ్బులు పోగొట్టుకోవద్దని అనంతపురం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ సూచిస్తున్నారు. శనివారం సాక్షితో మాట్లాడారు. మరిన్ని విషయాలు ఆయన మాటల్లోనే..

- డబ్బు, విలువైన ఆభరణాలు ఇంట్లో ఉంచి వెళ్లకూడదు.
- రాత్రి వేళ అనుమానంగా సంచరించే వారి గురించి పోలీసులకు వెంటనే సమాచారం అందించాలి.
- తాళం వేసిన ఇండ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వెతికినట్లు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి.
- విలువైన వస్తువులను పక్కింటి వారికి ఇచ్చి నమ్మి మోసపోవద్దు. ఇరుగు పొరుగు వారిని తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం మంచిది.
- వీలైనంత త్వరగా ప్రయాణం ముగించుకుని వచ్చేలా చూసుకోవాలి.
- ఖరీదైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో పెట్టుకుంటే మంచిది.
- పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.
- ఇంట్లో కుటుంబ సభ్యులు బయటకు వెళ్లేటప్పుడు ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధుల వద్దకు అపరిచితులు సమాచారం కావాలని వస్తే నమ్మవద్దు. ఏమరుపాటుగా ఉండవద్దు
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- కొత్తవారి కదలికలపై, అనుమానితుల సమాచారం అందించి దొంగతనాల నివారణకు సహకరించాలి.
- చుట్టుపక్కల వారి సెల్‌ఫోన్ నంబర్లు దగ్గర ఉంచుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది.
- బయటకు వెళ్లేటప్పుడు తాళాలను ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలి.
- గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి.
- లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టంను వినియోగించుకుని తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు చెక్ పెట్టండి
- సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి.
- అవసరం లేకుండా వచ్చే మెసెజ్‌ల్లో బ్లూ కలర్ లింకులను ఓపెన్ చేయద్దు.
- లాటరీ తగిలిందని.. ఏదో గిఫ్ట్ వచ్చిందని.. కారు, బైక్ వచ్చిందంటూ చెప్పే మాటలు నమ్మొద్దు. డబ్బు వచ్చింది.. విలువైన వస్తువులు తక్కువ ధరకు ఇస్తామని చెప్పే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలి. గిఫ్ట్‌లు తీసుకొచ్చామంటూ ఇళ్లలోకి వచ్చి వృద్ధ మహిళలు ధరించిన ఆభరణాలు లాక్కెళ్లే ప్రమాదం ఉంది. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలి.

బాల కార్మికుల ఏరివేతకు ప్రత్యేక బృందం



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

అనంతపురం సిటీ: బాల కార్మికుల గుర్తింపునకు స్వేచ్ఛ అనే ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అనంతపురంలోని కళ్యాణదుర్గం బైపాస్‌లో శనివారం వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా పర్యటించారు. హోటళ్లు, అంగళ్లు, మెకానిక్ షెడ్లు, ఇతర సంస్థల్లో బాల కార్మికుల కోసం గాలించారు. నాలుగో పట్టణ సీఐ సాయినాథ్, ఎస్ఐ విజయకుమార్, కార్మిక శాఖ అధికారులు సుజాత, రాధ రమాదేవి, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ తోపుల వెంకటకుమార్ సహా సిబ్బంది బృందంగా ఏర్పడి బాల కార్మికుల కోసం గాలించారు. ఆయా సంస్థల యాజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బడి ఈడు పిల్లలను బడికి కాకుండా పనికి పంపిస్తే తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ఆటో కార్మికుల సమస్యలపై పోరాటం

అనంతపురం అర్బన్: ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆటో డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.మల్లికార్జున అధ్యక్షతన జిల్లా సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. రాజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యావంతులై ఉండి ఆటో నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్న ఆటో కార్మికుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందన్నారు. పోలీసులు, ఆర్‌టీఓ అధికారుల వేధింపులు ఆపాలన్నారు. ఆటో కార్మికులకు నష్టదాయకంగా ఉన్న చట్టాల రద్దు, సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, వర్కింగ్ అధ్యక్షుడు వి.కె.కృష్ణుడు, నాయకులు రాజు, శ్రీనివాస్, చిరంజీవి, నాగేంద్ర, కృష్ణ నాయక్, రమేష్, భారతి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఈఈగా ప్రభాకర్‌రెడ్డి



జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మకు బొకే అందజేస్తున్న పీఆర్ ఈఈ ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం సిటీ: అనంతపురం పీఆర్ఐ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)గా ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. చైర్‌పర్సన్ స్పందిస్తూ.. ఈఈకి శుభాకాంక్షలు తెలిపారు. సమర్థవంతంగా పని చేసి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

'కొండా సురేఖ వ్యాఖ్యలు దుర్మార్గం'

అనంతపురం కల్చరల్: వివాదాలకు దూరంగా ఉండే అక్కినేని కుటుంబంపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని అక్కినేని ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు సతీష తప్పుబట్టారు. శనివారం ఓ ఫంక్షన్ హాల్‌లో అక్కినేని అభిమానుల సంఘం సభ్యులు విలేకరులతో మాట్లాడారు. కొండా సురేఖ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తాను ఒక మహిళ అన్న ఇంగితం మరచి నటి సమంతపై చేస్తున్న నీచమైన ఆరోపణలు బాధాకరమన్నారు. మనోభావాలను దెబ్బతీస్తున్న ఇటువంటి వారు మంత్రులుగా కొనసాగడానికి అర్హత లేదన్నారు. అక్కినేని కుటుంబం తరాలుగా ఏ రాజకీయ పార్టీకి వత్తాసు పలకలేదని గుర్తు చేశారు. అలాంటిది అనవసరంగా వారి కుటుంబాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాల్లోకి లాగడం క్షమించరానిదన్నారు. కొండా సురేఖ క్షమాపణలు చెప్పిన తర్వాత కూడా అదే పద్ధతిలో సమర్థించుకోవడాన్ని తప్పుబడుతున్నామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అక్కినేని ఫాన్స్ అసోసియేషన్ సభ్యులు రెడ్డిపల్లి పవన్, శ్రీనివాస్, లోకేష్, రమేష్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో ప్రొటోకాల్ రగడ



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో 'ప్రొటోకాల్' అంశంపై సభ్యులు అధికారులను నిలదీశారు. ప్రభుత్వం మారితే స్థానిక ప్రజాప్రతినిధులు కూడా మారినట్లు గ్రామాల్లో అధికారులు వ్యవహరిస్తున్నారంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో అనంతపురం రూరల్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండాలోని వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్‌తో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ప్రొటోకాల్ అంశంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ఏ పదవులూ లేని టీడీపీ కార్యకర్తలను కూర్చోబెడుతున్నారంటూ నిలదీశారు. ఏ హోదాతో వారిని కూర్చోబెడుతున్నారో అధికారులు చెప్పాలంటూ పట్టుబట్టారు. స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలకు కనీస గౌరవం ఇవ్వడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులుగా తాము ఎందుకున్నట్లు అని మండిపడ్డారు. ఇటీవల జరిగిన గ్రామసభలకు గాని, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న మాసోత్సవాల్లో గాని స్థానిక ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వలేదంటూ మండిపడ్డారు. తమకు కనీస గౌరవం ఇవ్వనప్పుడు పదవుల్లో ఎందుకుండాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచైనా ప్రొటోకాల్ అమలు చేయకపోతే వచ్చే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. చియ్యేడులో ఇళ్లపై ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌ను మార్పు చేయాలంటూ గత మూడు సమావేశాల్లోనూ అధికారుల దృష్టికి తీసుకొస్తున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోలేదంటూ వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచ్ గంగాధర్‌రెడ్డి వాపోయారు. ఎంపీడీఓ దివాకర్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజాప్రతినిధులకు గౌరవం ఇస్తామన్నారు. గ్రామాల్లో ప్రొటోకాల్ పాటించే విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మండల అధికారులు ఎంఈఓ వెంకటస్వామి, సీఎస్‌డీటీ బాషా, వైద్యాధికారి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మీ ఇళ్లను ఇలాగే ఉంచుకుంటారా?



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి

ఆత్మకూరు: అనారోగ్యానికి గురైన వారు చికిత్సల కోసం ఆస్పత్రికి వస్తారు. అలాంటి రోగం నయం చేసే ఆస్పత్రి అపరిశుభ్రంగా ఉంటే ఎలా అంటూ డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి ఆసుపత్రి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రిలో అన్ని గదులతో పాటు ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఇది ప్రభుత్వ ఆసుపత్రేనా? అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అపరిశుభ్రంగా ఉంటే ఎలా? మీ ఇళ్లనూ ఇలానే అపరిశుభ్రంగా ఉంచుతారా అంటూ మండిపడ్డారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి సిబ్బంది ఏర్పాటు చేసిన ఆసుపత్రి డెవలప్‌మెంట్ మీటింగ్‌లో పాల్గొన్నారు. వైద్య సిబ్బంది తమకు కేటాయించిన గదుల్లో కూర్చొని రోగులకు వైద్యం అందించాలని తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉండాలని తెలిపారు. అనంతరం ఎంపీపీ హేమలత, సర్పంచ్ వరలక్ష్మి పలు సమస్యలను డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రిని శుభ్రంగా ఉంచాలని స్వీపర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సబిహా సుల్తానా పాల్గొన్నారు.

కుష్టు, టీబీ నివారణకు కృషి చేయాలి

అనంతపురం మెడికల్: జిల్లాలో కుష్టు, టీబీ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి సిబ్బందిని ఆదేశించారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించే వైద్యాధికారులకు పునశ్చరణ తరగతులు నిర్వహించారు.కుష్టు వ్యాధి కేసును తొలి దశలో గుర్తించి వైద్యం అందిస్తే.. అంగ వైకల్యం నుంచి రక్షించవచ్చని తెలిపారు. జిల్లా కుష్టు, టీబీ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ మాట్లాడుతూ.. కుష్టు, టీబీ వ్యాధుల పట్ల ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేలా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. కుష్టు వ్యాధి ఏ దశలోనైనా నయం అవుతుందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో పారామెడికల్ అధికారి నాగన్న, హెచ్ఈఓ సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆవిష్కరణలతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎస్కేయూ ఆచార్యుడు మురళీధరరావు

అనంతపురం ఎడ్యుకేషన్: విజ్ఞాన శాస్త్రం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యార్థులు నిరంతరం వినూత్న ఆవిష్కరణలతో ముందుకెళ్లాలని ఎస్కేయూ ఆచార్యుడు డి.మురళీధర్ రావు సూచించారు. శనివారం ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో రీజినల్ స్థాయి స్టూడెంట్ టెక్నికల్ సెమినార్ నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్కేయూ ఆచార్యుడు మురళీధర్‌రావు మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న విజ్ఞాన శాస్త్రం మానవాళికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. జీవ సాంకేతిక శాస్త్రం, మైక్రో బయాలజీ, రసాయన శాస్త్రం, ఆహార, సాంకేతిక శాస్త్రం భవిష్యత్తుకు మరింత ఉత్తేజకరమైన పరిణామాలు, ఆవిష్కరణలకు అవకాశాలు అందిస్తాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు బి.నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.మహమ్మద్ రఫీ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, కన్వీనర్ డాక్టర్ ఎస్.రిజ్వానా బేగం, కో-కన్వీనర్ ఎం.కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

ఇద్దరికి డాక్టరేట్ల ప్రదానం



వై.దీపిక



పి.విఠల్ రావు

అనంతపురం: ఎస్కేయూలోని కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో పరిశోధన చేసిన వై.దీపిక డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ వి.రఘునాథ రెడ్డి పర్యవేక్షణలో 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హురిస్టిక్ మోడల్ టు ఇంప్లిమెంట్ సెక్యూర్డ్ ఎనర్జీ-ఎఫిషియంట్ రౌటింగ్ ప్రోటోకాల్స్ ఫర్ ఎనిరిచ్‌మెంట్ ఆఫ్ ది లైఫ్‌టైం ఆఫ్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్స్ యూసింగ్ క్యూ-లెర్నింగ్ టెక్నిక్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

అనంతపురం: ఎస్కేయూలోని న్యాయశాస్త్ర విభాగంలో పరిశోధన చేసిన పి.విఠల్ రావుకు శనివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ బి.హైదర్‌వలి పర్యవేక్షణలో 'సమాచార హక్కు చట్టం-సుపరిపాలన విశ్లేషణ' అనే అంశంపై పరిశోధన చేశారు. కణేకల్లు మండలం గనిగెర గ్రామానికి చెందిన విఠల్‌రావు మడకశిరలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సమాచార హక్కు చట్టం వల్ల ప్రజాపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొంది సుపరిపాలనకు దారి తీస్తుందని రీసెర్చ్ థీసిస్‌లో విశ్లేషణాత్మకంగా వివరించారు.

శక్తిస్వరూపిణీ నమోస్తుతే



బాల యోగి ఆశ్రమంలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి అలంకరణ



నవధాన్యాల అలంకరణలో ఉమానగర్ రేణుకా మాత



టౌన్ బ్యాంక్ వద్ద కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న మేయర్ వసీం సలీం

అనంతపురం కల్చరల్: నగరంలో దసరా నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నగరంలోని శ్రీజ్ఞానపీఠంలో అమ్మవారు దేవి చంద్రఘంటేశ్వరిగా పూజలందుకుంది. చండీహోమం, శ్రీసూక్త హోమం, అవంతి హోమాలను, పల్లకీసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ మీనాక్షిదేవిగా, శంకర మఠంలో కౌమారిగా, మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో శారదామాత భువనేశ్వరీదేవిగా దర్శనమిచ్చింది. సాయంత్రం అశ్వవాహనంపై అమ్మవారు వారాహి అలంకారంలో పూజలందుకున్నారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే శివబాలయోగి ఆశ్రమంలో అమ్మవారు లక్ష్మీ వేంకటేశ్వర అలంకారంలో పూజలందుకుంది. సూర్యానగర్ మల్లాలమ్మ ఆలయం, ఐదవ రోడ్డు నల్లమల సుంకులమ్మ, గుత్తి రోడ్డు చౌడేశ్వరీ మాత, పాతూరు, కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాల్లో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు విభిన్న రూపాల్లో భక్తులను కటాక్షించారు. సుభాష్ రోడ్డు అర్బన్ బ్యాంకు వద్ద దుర్గామాతను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో పాటూ అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, సుంకర రమేష్ బోయ గిరిజమ్మను సత్కరించారు.

దసరా ఆనందాలను తేవాలి

అనంతపురం కల్చరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అందరిలో మరింత ఆనందాలను తేవాలని నగర మేయర్ వసీం ఆకాంక్షించారు. శనివారం రాత్రి హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త కార్పొరేటర్ గురుశేఖర బాబు, మాజీ కార్పొరేటర్ హిమబిందు మేయర్‌ను శాలువాతో సత్కరించారు.కార్పొరేటర్ కమల్ భూషణ్ పాల్గొన్నారు.

అన్నపూర్ణ దేవిగా దుర్గాదేవి

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లోని గౌరీ ప్రసన్నేశ్వర స్వామి దేవాలయంలో దేవి శరన్నవరాత్రులు కొనసాగుతున్నాయి. దుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జేఎన్‌టీయూ రోడ్డులోని ముత్యాలమ్మ, ఇందిరమ్మ కాలనీలో ఐదో క్రాస్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అన్నపూర్ణా దేవి అలంకరణలో పూజలందుకుంటున్నారు. రాప్తాడులో శివాలయంలో పార్వతి దేవి, పెద్దమ్మ, మారెమ్మ, మరిగమ్మ, గంగలకుంట గ్రామంలో దుర్గాదేవి, బుక్కచెర్లలో నల్లలమ్మ దేవతలు గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఆత్మకూరు: ఆత్మకూరులోని వాసవీ మాత ఆలయంలో వాసవీ మాతను ఉదయం బాలత్రిపుర సుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం చంద్రఘండా దేవిగా అలంకరించారు. పంపనూరులోని పార్వతి దేవికి, వడ్డుపల్లిలోని సుంకులమ్మ అమ్మవారికి పూజల అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు.

నోరూరించే మహాప్రసాదం

- వాసవీ అమ్మవారి శాల పులిహోరకు బారులుదీరుతున్న భక్తులు



పులిహోర తయారు చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: తిరుమల తిరుపతి అంటేనే లడ్డు గుర్తుకొస్తుంది. శబరిమల వెళ్లిన వారు బియ్యంతో చేసిన ప్రసాదం తేకపోతే తృప్తిగా ఉండదు. అలా పుణ్యక్షేత్రాలలో ప్రసిద్ధి గాంచిన మహాప్రసాదంగా వాసవీ అమ్మవారి శాల పులిహోరకు అంతే ప్రఖ్యాతి వచ్చేసింది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వచ్చాయంటే ఎంతో మంది దీని కోసం వేచి చూస్తుంటారంటే అతిశయోక్తి కాదు. దసరాలో ప్రత్యేకంగా కనపడేది వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాల్లో అత్యంత రుచికరంగా ఉండే పులిహోర ప్రసాదం. రోజు 4 వేల మంది చొప్పున ఇక సెలవు రోజులైతే 6 వేల మందికి పులిహోర ప్రసాదమందిస్తారు. పది రోజుల పాటూ సాగే ఉత్సవాల్లో దాదాపు 60 వేలమందికి పైగా ఒక్క కొత్తూరు అమ్మవారి శాలలోనే ప్రసాద వితరణ ఉంటుంది. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకూ భక్తులు బారులుదీరుతారు.

తయారీ ఆషామాషీ కాదు

అనంతలో వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలు ఆవిర్భవించి దాదాపు 70 ఏళ్లు అవుతున్నా ఇటీవల గత ఇరవై ఏళ్లగా పులిహోర ప్రసాదానికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. మామూలుగా హోటళ్లలో చేసినట్లు ఆషామాషీగా తయారు చేసేస్తే నిర్వాహకులు ఒప్పుకోరు. నిత్యం అమ్మవారికి నివేదించిన దినుసులతోనే ప్రసాదాన్ని వండుతారు. గతంలో ప్రసాదం తయారీకి నాలుగైదు బస్తాలు వాడుతుంటే సరిపోయేవి. కానీ ఇప్పుడు ఏకంగా 10 బస్తాలు వేసినా చాలడం లేదని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. అలా నిత్యం 200 నుంచి 250 కేజీల వరకు బియ్యం, పది కేజీల చింతపండు వాడతారు. అంటే మొత్తం పది రోజులకు 100 బస్తాలకు పైగా బియ్యం వినియోగిస్తారు. కొన్ని సమయాల్లో స్థానిక వంటవాళ్లతో పాటూ కర్ణాటక నుంచి వచ్చేవారి సంఖ్య కూడా ఉంటుంది. అన్ని నాణ్యమైన వస్తువులతోనే చిక్కటి పులుపు కారంతో శనగిత్తనాలతో ఎంతో రుచిగా తయారు చేసి తొలి ప్రసాదాన్ని అమ్మవారికి నైవేద్యంగా పెడతారు. తర్వాత భక్తులకందించే ప్రసాదంలో కలిపేస్తారు.

నాణ్యతగా ఉంటుంది

రెండు దశాబ్దాలకు పైగా అమ్మవారి ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో తయారు చేయిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపా మచ్చానరసింహులు తెలిపారు. నిత్యం పది బస్తాలు చొప్పున వేస్తున్నా ఇక్కడి ప్రసాదానికున్న రుచి వల్ల మళ్లీ మళ్లీ వచ్చే వారికి కాదనకుండా ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అనంతపురం అర్బన్: కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్, రూరల్ మండలాలకు ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. డీఆర్‌డీఏ పీడీ కార్యాలయంలో ఈనెల 7వ తేదీ (సోమవారం) జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని పరిష్కార వేదిక ఇన్‌చార్జి వాణిశ్రీ తెలిపారు. కార్యక్రమంలో రెండు మండలాలకు సంబంధించిన తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలు, వీఆర్ఓలు పాల్గొంటారన్నారు. అనంతపురం అర్బన్, రూరల్ మండలాల ప్రజలు సమస్యలపై అర్జీలను డీఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించనున్న పరిష్కార వేదికలో సమర్పించాలని సూచించారు.